# చుక్కల్లో చంద్రుడు

'శశీ ధవళ ధూసరో, గళిత యౌవనా కామినీ, సరోవిగత వారిజం, ముఖమనక్షరం స్వాకృతేః... మనసి సప్త శల్యానిమే' ఎంత చక్కటి శ్లోకం భర్తృహరిది అన్పించేది రంగనాథానికి. కాని ఇవ్వాళేముంది? చుక్కలన్నీ రాలిపోయాయి. తెల్లవారినా గతించని పేలవమైన చంద్రుడతను. ధవళ ధూసరుడైన శశి. ఆ నవ్వు - తన గుండెల్ని మండించే నవ్వనుకున్నాడు కాని, లోకపు మూర్ఖత్వాన్ని చూసి జాలితో నవ్విన నవ్వని తానర్థం చేసుకోలేకపోయాడు. ఎన్ని ప్రయత్నాలు - ఆ నవ్వును ఆర్పేయాలని? ఆ నవ్వుకు దూరంగా పోవాలని? అతని మనో యవనికలో తిరిగిరాని గతం మెదిలింది.

★ ★ ★

పెదనాన్నగారి కూతురి పెళ్ళికి వెళ్ళాడతను. పెద్దమ్మకు దూరపుచుట్టం సుభద్ర. పెళ్ళి పనుల్లో హడావుడిగా ఆమె తిరుగుతూంది. ఆమెకోసమే తనూ చురుగ్గా పనులు చేసేవాడు. పల్లెటూరి పెళ్ళి, ఎలక్ట్రిసిటీ లేదు. డజనుదాకా పెట్రోమాక్సులైట్లు వచ్చాయి. సుభద్ర వాటిని శుభ్రం చేసి, కిరసనాయిలు పోస్తుంటే వాటిని వెలిగిస్తూ అడిగాడు తను ''ఏం పేరు?'' అని.

''సుభద్ర'' అందామె సిగ్గుపడ్తూ, తొలకరి నవ్వు పెదాలపై సంధించి.

''ఏం చదువుతున్నావు?''

''ఏదో వానాకాలం చదువు...''

''ఏ ఊరు మంది?''

''మీదే వూరో నాకు తెలీదు'' అందామె, ఆ ఇంటరాగేషనుకు తన అయిష్టతను ధ్వనింపచేస్తూ.

''మాది విజయవాడ. వాల్తేరులో ఎం.కాం. చదివాను. ప్రస్తుతం హైదరాబాదులో ఓ ప్రైవేటు కంపెనీలో అకౌంటెంట్‌గా పని చేస్తున్నాను. విజయవాడ గవర్నరుపేటలో మాకో ఇల్లుంది. నందిగామలో పొలాలున్నాయి. మా అక్కకు పెళ్ళయింది. ఆమె భర్త డాక్టరు. చెల్లెలింకా చదువుతోంది'' గొప్పగా తన వివరాలన్నీ చెప్పాడు.

ఫక్కున నవ్విందామె. ''గుప్‌గుప్ మంటోంది ఆది. ప్రెజరు చాలినట్టు లేదు. పంపు కొట్టండి'' అందామె లేచిపోతూ.

ఆమె నవ్వు సమ్మోహనాస్త్రం. రంగుల వలయంలో గిరికీలు కొట్టించే ముగ్ధస్మితం అది. తనే కోరి ఆమెను వివాహం చేసుకున్నాడు. తనూ, తనతల్లీ, చెల్లెలూ, మేనమామ వెంకట్రావూ లాంఛనపు పెళ్ళిచూపులకెళ్ళారు. సుభద్ర తండ్రి దశరథరామయ్యగారు మేనమామతో కబుర్లాడుతున్నాడు.

టిఫెనులయిపోయాయి. సుభద్ర కాఫీ తీసుకొచ్చింది. చూడచక్కని సౌందర్యం సుభద్రది. సన్నగా, పొడుగ్గా, లేత తమలపాకులా వుంది. కళగల ముఖం. పచ్చని పసిమి, పసిమికితోడు కట్టుకున్న పసుపుపచ్చటి చీరె, జాకెట్టూ ఆమెవంటికి నప్పాయి. అందరికీ కాఫీ ఇస్తూ తనకీ ఇచ్చింది. ఆమెవంకే చూస్తూ కప్పందుకున్నాడు తను. కాఫీ నిండుగా వుండటంతో తొణికి తన తెల్లపాంటుపై పడింది.

''ఏమిటిరా అది! కొంచెం జాగ్రత్తగా తీసుకోకూడదూ కప్పు'' అన్నాడు మేనమామ.

''అయ్యో! కొంచెం నీళ్ళు తీసుకురా అమ్మాయి! తడి గుడ్డతో తుడిచేస్తే మరక పోతుంది'' అన్నాడు సుభద్ర తండ్రి.

తను ఆమెవంక చూశాడు. చెయ్యడ్డం పెట్టుకొని నవ్వుతోంది సుభద్ర. తనకనుమానమొచ్చింది - కాఫీ తన చేతిలో తొణికి పాంటు మీద పడ్డదా, ఆమే తన పాంటుమీద కాఫీ తొణికించిందా అని.

అందరికీ పిల్ల నచ్చడమే కాక, వాళ్ళిచ్చే కట్నమూ నచ్చింది. తను నచ్చకపోయే ప్రశ్నే లేదు. పెళ్ళిలోనూ ఆమె సమ్మోహనాస్త్రం తనను తికమక పెట్టింది. బిందెలో ఉంగరం వేసి తీయమంటే, ఆమె నవ్వుమొహం చూస్తూ తన్మయంలో వున్న స్థితిలో రెండు సార్లూ ఆమే ఉంగరం తీసింది. మూడోసారి ఆమె ముఖంవంక చూడకుండా తను బిందెలో చేయిపెట్టి తీయ ప్రయత్నించాడు కానీ, ఆమె తన చెయ్యి గిల్లి ఉంగరం తన చేతిలోనుండి లాగేసుకుంది. తను తెల్లమొఖం వేసుకుని చూస్తుంటే, ఆమె పక్కకు తిరిగి కళ్ళతో నవ్వేసింది. చెల్లెలు రాధ అననే అన్నది. ''వదిన మరీ గయ్యాళిలావుంది. మూడుసార్లూ ఉంగరం తనే తీసింది. అన్నయ్యని నెగ్గనిచ్చేట్టు లేదు'' అని.

అప్పుడే మొదటిసారనిపించింది ఆమె నవ్వు విషయంలో జాగ్రత్తగా వుండాలని. అప్పుడేం తెల్సు తనకు - ఆ నవ్వు ఆమె వ్యక్తిత్వంనుండి ప్రభవించిందని? పెళ్ళయి పదహారురోజుల పండగ కూడా వెళ్ళలేదు. తన ఆఫీసునుండి టెలిగ్రాం వచ్చింది. మార్చి నెల ఆడిట్ జరుగుతోంది. తన్ను వెంటనే వచ్చి జాయినవమని ఉత్తర్వు. దిగాలుగా కూర్చున్న తన్ను చూసి నవ్వింది సుభద్ర.

''ఎందుకట్లా అయిందానికీ, కానిదానికీ నవ్వుతావు?'' అన్నాడు తను.

''నవ్వకపోతే ఏడవమంటారా?'' అందామె.

''సమయం, సందర్భం వుండాలి నవ్వడానికి!''

''మీ దిగాలు మొహం చూస్తే నవ్వొచ్చింది నాకు''

''అంటే నేను వెళ్ళిపోయినా నీకేం బాధలేదన్నమాట''

''బావుంది ఆఫీసుకెళ్ళి పనిచేసుకోకపోతే ఎట్లా?''

''ఎప్పుడూ వుండే ఆఫీసే. నేను వెళ్ళకపోయినందువల్ల ఏం మునిగిపోదు''

''నేనూ ఎప్పుడూ వుండేదాన్నే. అంత దిగులుపడాల్సిన అవసరం లేదు''

అలా ఎప్పుడూ తన్ను తన కర్తవ్యం నిర్వహించేటట్లు చేసేది ఆమె. చిన్న చిన్న సమస్యలకే చికాకు పడేవాడు తను. ప్రపంచం తన్ను మోసం చేస్తుందని బాధ పడేవాడు.

''ఆ బుచ్చి వేంకట నరసింహంగారు ట్రాన్స్‌ఫరు కాకపోతే నాకు ప్రమోషనొచ్చేది. ఆయనకు నేనంటే చాలా ఇష్టం. ఇప్పుడొచ్చిన కొత్త ఆఫీసరుని నమ్మటం కష్టం. ఆ ముత్తుస్వామికే ఇస్తాడు'' అన్నాడు తను ఓసారి.

''మీ పాత మేనేజరులా ఈయనా ఎప్పుడూ చిర్రుబుర్రులాడుతుంటాడా?'' అంది సుభద్ర.

''అదేం లేదు. నీలా, ఎప్పుడూ పళ్ళికిలిస్తుంటాడు. మనిషి మెత్తగా, మర్యాదగా వుంటాడు. ఇలాంటి వాళ్ళే కొంపలు ముంచేవాళ్ళు''

''ఆ ముత్తుస్వామి మీలాగా కాస్టింగ్ పరీక్ష తీసుకోలేదుగా. ఎన్నాళ్ళనుండి పనిచేస్తున్నా అతనికి అకౌంట్స్, రూల్సు ఆకళింపు కావని మీరే చెప్తుంటారాయె. ఒట్టి సీనియర్ కదా అని ప్రమోషన్ ఇస్తాడని మీరు భ్రమ పడ్తున్నారు. అదేమీ జరగదు'' అంది సుభద్ర.

''పాపం అన్నీ తెలిసిందానివి వచ్చావు. వచ్చిన కొత్త మేనేజర్ పేరేంటో తెల్సా.నటరాజన్. అరవ్వాడు, అరవ్వాడికివ్వక మనకిస్తాడా?''

''మీది గవర్నమెంటు ఆఫీసు కాదు, పనికిరాకపోయినా సీనియర్ కదా అని ప్రమోషన్లివ్వటానికి. ప్రైవేటు కన్సర్న్స్‌లో అసమర్థులకు ప్రమోషన్లిచ్చి, పన్ను కాక కంపెనీలు మూతపెట్టుకోరు. ఇంతమాత్రం అర్థం చేసుకోకపోతే ఎలా?'' అని నవ్వింది సుభద్ర.

''నీకేం తెల్సు ప్రపంచం సంగతి. పెద్ద అన్నీ తెల్సిన దానివిలాగ మాట్లాడుతున్నావు''

''పోనీండి ప్రమోషన్ రాదు, కొంపేం మునిగిపోతుంది. మీరు బాగా పనిచేస్తున్నంత కాలం మీ ఉద్యోగానికేం ఢోకాలేదు. ఇలా ప్రతిదానికీ బాధ పడ్తూ కూర్చుంటే ఎలా? ఉన్న నాలుగు రోజులూ నవ్వుతూ బతకాలి''

''పాఠాలు చెప్పక''

''అబ్బ! మా వారిమొహం ఎంత బావుందో. ఎర్ర బడిన ఆ మొహం కోతిలాగ, కొండముచ్చులాగ''

''నన్ను కోతంటావా?''

''పోన్లేండి, గండుపిల్లి!'' అని పకపకా నవ్వి ఇంట్లోకి పారిపోయింది ఆమె.

అయితే తన అంచనానే తప్పయింది. తనకే ప్రమోషన్ వచ్చింది. ప్రపంచంనుండి రాబట్టుకోవటమే తన స్వభావం. ప్రపంచానికి తిరిగి తనేమన్నా ఇవ్వాలన్న ఆలోచన తనకెప్పుడూ ఉండేది కాదు. చదువు, ఉద్యోగం, డబ్బు అన్నీ తనకోసమే వున్నాయి. పక్క పెరట్లో పూసే పూలూ తనకోసమేనన్నట్లుండేది తన స్వభావం.

సుభద్ర పురిటికి వెళ్ళినప్పుడు కలిగింది పక్కింటి కృత్తికతో పరిచయం. అప్పుడామె తనకంటే ఒకటి రెండేళ్ళు పెద్దదేమో. ముప్ఫయ్యేళ్ళు పైబడి ఉన్నాయి. పెళ్ళవుతుందన్న ఆశ ఆమెకు లేదు. స్కూల్లో టీచరుగా పనిచేసేది. హెడ్‌మిస్ట్రెస్ ప్రమోషన్‌కి అకౌంట్స్ టెస్ట్ పాస్ కావాలి. అకౌంట్సూ చెప్పాడు, ప్రేమ పాఠాలూ చెప్పాడామెకి తను. తనామెని మోసం చేసిందేం లేదు. తను పెళ్ళయినవాడని ఆమెకి తెలుసు. ఆమె సుభద్ర కంటే అందమైంది కాదు. అయినా ఆరోజుల్లో పరాయిస్త్రీ అంటే తనకు మోజుండేది.

కొడుకు విరించి బాలసారెకు తను సుభద్ర పుట్టింటికి వెళ్ళాడు.

''విశ్వనాథంగారబ్బాయి చందూ ఎలా ఉన్నాడు'' అనడిగింది సుభద్ర తనెళ్ళగానే.

''చందూ ఎవరూ'' అన్నాడు తను.

''అదేవండీ కృత్తిక మేనల్లుడు లేడూ, ఆ పిల్లవాడు''

అప్పుడు గుర్తుకొచ్చింది తనకు, పుట్టుకతోనే మెంటల్ రిటార్డెడ్‌నెస్‌తో పుట్టిన ఆ పిల్లవాడి సంగతి.

''వాడా.. వాడు.. మొన్నేం చేశాడో తెల్సా...'' అని నవ్వాపుకోలేక నవ్వాడు తను.

''ఏంటా నవ్వు? ఏం చేశాడు చందూ?''

''మొన్న స్కూలు నుంచి వచ్చి, మంచం కింద కూర్చుని లెక్కలు చేసుకుంటున్నాడట. వీడు రావటం ఎవరూ చూడలేదు. విశ్వనాథం, వసంత, కృత్తిక అందరూ గాబరాపడిపోయారు. వాడికోసం రోడ్లన్నీ సర్వే చేసి పదింటికొచ్చారు. ఇంట్లో అందరూ గాబరా పడుతున్నా వాడి ధ్యాసలో వాడుండిపోయాడు. ఎనిమిదింటికి కాబోలు మంచం కిందనుండి బయటకొచ్చి, 'అమ్మా, ఆకలే' అన్నాడు. టెన్త్ క్లాసు చదువుతున్నా వెధవకి ఆమాత్రం జ్ఞానం లేదు.'' అని తను నవ్వేశాడు.

''అసలే మేధకుడు పిల్లవాడు. వాణ్ణి చూసి నవ్వకండి. జాలిపడాలి కాని నవ్వకూడదు.'' అంది సుభద్ర.

''ఏం, నువ్వు నవ్వగా లేంది నేను నవ్వితే వచ్చిందా?''

''నేను నిస్సహాయులను చూసి ఎప్పుడూ నవ్వను''

కాని తన నిస్సహాయతకు నవ్వటం తెల్సామెకు. తన స్త్రీ వ్యామోహం సంగతి చూచాయగా తెల్సినా స్పష్టంగా బయటపడే వరకూ ఆమేం చేయలేకపోయింది. సుభద్ర వచ్చింతర్వాత కృత్తికతో పరిచయం కష్టమైంది. ఆమెకు నచ్చచెప్పి అన్ననుండి విడిపోయి వేరు కాపురం పెట్టించేట్టు చేశాడు తను. అయినా కొద్దికాలంలోనే ఆమె అంటే మొహం మొత్తిపోయింది తనకు.

సంపాదన పెరగటంతో తన స్త్రీ స్నేహాలూ ఎక్కువయాయి. అనూరాధతో పరిచయమైంది. తన ఊరే ఆమెది. తండ్రిపోవటంతో నిరాధారమైంది ఆమె కుటుంబం. తనకు ఉత్తరం రాస్తే, తనే ఆమెకు తన ఆఫీసులో ఉద్యోగమిప్పించాడు. ప్రపంచమంతా వాణిజ్య విపణిలా కన్పించేది తనకు ఆ రోజుల్లో. ఎవరూ ఎవరికోసమూ ఊర్కే ఏం చేయరని తన అభిప్రాయం. ఆమె అవసరానికి తన్ను వాడుకుంది. తను తన అవసరానికి ఆమెని వాడుకుంటేనేం. మొదట్లో బెట్టుపోయింది కాని, తన అండదండలు లేకపోతే ఉద్యోగం నిలవదని ఆమెకు తెల్సిపోయింది. లొంగిపోయింది.

సుభద్రకు తన సంబంధాలేం తెలియకుండా తను వీలైనన్ని జాగ్రత్తలు తీసుకునేవాడు. అయినా చూచాయగా ఆమెకు తెలియవచ్చేవి. అయితే, తనకు స్పష్టంగా తెలిసిందాకా 'ఇదేం పని?' అని అడగలేదు. కొత్త పరిచయాలు ఏర్పడడంతో ఆమధ్య తను అనూరాధని కలవలేకపోయాడు. ఓసారి సుభద్రతో షాపింగ్‌కి వెళ్ళినప్పుడు కన్పించింది ఆమె.

''కన్పట్టమే లేదీ మధ్య?'' అందామె.

''ఎక్కడా తీరిక లేదు''

''మరీ నల్లపూసై పోయారు. అంత ఎక్కువసమైనానా!''

''ఏమిటిదీ, కాస్త చూసి మాట్లాడు....'' అన్నాడు తను.

అప్పుడు చూసిందామె సుభద్రను. ఖంగుతినిపోయింది.

''రంగనాథం గారిది మా ఊరే. అందుకే అంత చనువుగా మాట్లాడుతున్నాను'' అంది సర్దుకుంటూ.

''ఇప్పుడు నేనేమన్నాను?'' అంటూ తన వంక చూసి నవ్వింది సుభద్ర.

విరించి పుట్టిన రెండేళ్ళకు సుభద్ర గర్భవతైంది. ఈసారి ఆమె ఆరోగ్యం బాగా దెబ్బతింది. డాక్టరు దగ్గరకు వారం, పదిరోజులకోసారి తీసుకెళ్ళేవాడు తను. ఈసారి కాన్పుకు పుట్టింటికి వెళ్ళమన్నా వెళ్ళలేదు ఆమె. అయినా తన తిరుగుళ్ళకు ఆమె అభ్యంతరం కాలేదు.

ఈసారి తనకి కూతురు పుట్టింది. రాజ్యలక్ష్మి అని పేరు పెట్టుకున్నారు. తను రోహిణి అని పేరు పెడదామన్నాడు.

''ఆ నక్షత్రాల పేర్లు నా కూతురికక్కర్లేదు'' అంది సుభద్ర నవ్వుతూ.

పిల్లలు పెద్దవాళ్ళవుతున్నారు. తన సంపాదన పెరుగుతూనే వుంది. హైదరాబాదులో స్వంత ఇల్లుకూడా కట్టుకున్నారు తాము. అయినా స్త్రీ కాంక్ష తనని విడవనేలేదు.

ఓసారి ఆటోలో ఇంటిముందు దిగిన స్వాతిని చూసి ఆశ్చర్యపోయాడు తను. తనతో పరిచయం ఉన్న స్త్రీలను తను ఇంటికి రానిచ్చేవాడు కాదు.

''మా ఇంటి అడ్రసు ఎలా తెల్సింది?'' అని లోపలికొస్తున్న ఆమెనడిగాడు తను.

''ఆ మధ్య రమేష్ కనపడి ఇచ్చాడులే. ఇంట్లోకి రానిచ్చేదుందా లేదా?'' అంది స్వాతి.

''ఆఁ రారా...'' అన్నాడు తను పక్కకు తప్పుకుంటూ.

''మా వారి క్లాసుమేటా మీరు! ఆయనంతే లెండి. అవసరమైనవి తప్ప మిగతావి మాట్లాడుతుంటారు. మీరు లోపలికి రండి'' అంది సుభద్ర స్వాతిని లోపలికి ఆహ్వానిస్తూ.

''అవునండీ. నాపేరు స్వాతి. ఆఫీసు పనిమీద వచ్చాను విశాఖపట్నం నుండి'' అంది ఆమె.

స్వాతి తనకు క్లాసుమేటే గాని తనకప్పుడు ఆమెతో సంబంధంలేదు. ఆమె భర్త ఏక్సిడెంటులో చనిపోతే హైదరాబాదులో ఎవరూ ఆమె బంధువులు లేకపోవటం వల్ల మిత్రుడుగా తనామెకి సాయం చేశాడు. కంపాసినేట్ గ్రౌండ్స్‌లో భర్త ఆఫీసులో ఆమెకు ఉద్యోగం వచ్చే ప్రయత్నం చేశాడు. తను చేసిన సాయానికి స్వాతి ప్రతిఫలం చెల్లించుకుంది. ఆ తర్వాత ఆమెకు విశాఖపట్నం ట్రాన్స్‌ఫరయింది. ఇంటికొచ్చిన ఆమెతో పూర్వపరిచయాన్ని రిన్యూ చేసుకోకుండా వుండలేకపోయాడు తను. భార్య నిద్రపోతున్నప్పుడు లేచి వెళ్ళి ఆమెతో గడిపి బెడ్‌రూంలోకి వచ్చిన తనను చూసి సుభద్ర అడగనే అడిగింది. ''ఎక్కడకెళ్ళారు, ఇంతసేపూ...!'' అని.

''నిద్ర పట్టక బయట వరండాలో తిరిగొచ్చాలే'' అన్నాడు తను.

నవ్వింది సుభద్ర. ''పాపం, స్వాతి వచ్చినప్పటినుండీ ఉలికిపడ్తూనే వున్నారు. నిద్రకూడా పట్టలేదన్నమాట'' అంది.

''ఏమిటా నవ్వు! అర్థంలేని మాటలు మాట్లాడకు. ఆమెతో నాకేం సంబంధం?''

'' ఆమాట నేననలేదు. మీరే వున్నదని చెప్తున్నారు, భుజాలు తడుముకుంటూ''

''నువ్వొట్టి అనుమానం మనిషివి!'' అని పక్కకు తిరిగి పడుకునుండిపోయాడు తను.

పిల్లలు స్కూలు చదువులు వదలి కాలేజీలకొచ్చారు. వాళ్ళ విషయాలలో తనేం లోపం చేయలేదు. స్త్రీలతో తన తాత్కాలిక సంబంధాలు తనకెప్పుడూ తృప్తి కలిగించకపోయినా, ఆ మృగతృష్ణ వెంట పరుగెత్తుతూనే వుండిపోయాడు తను.

ఓసారి ఫోను రింగయింది. సుభద్రే ఫోనెత్తింది.

''ఎవరూ...?'' అనడిగాడు తను.

''మరో తార! ఇప్పటికి రెండు సార్లు ఫోను చేసింది మీకోసం'' అంది ఫోను పక్కన పెడ్తూ.

''తారా! తారెవరూ...?'' అన్నాడు తను.

''ఆశ్లేషట!!''

తను ఫోనందుకున్నాడు. ''రేపు నాగార్జునసాగర్ వెళ్ళివద్దామా? మా వారు కూడా ఊళ్ళో లేరు'' అంది ఆశ్లేష.

''సరే, తరువాత మాట్లాడతాను'' అన్నాడు తను ఫోను పెట్టేస్తూ, భార్య ఎదురుగా ఆమెతో మాటలు పెంచడం ఇష్టం లేక.

''ఎక్కడకు రమ్మంటోంది?'' అనడిగింది సుభద్ర.

''శివారెడ్డి లేడూ, మా కొలీగే. ఆయన భార్య. వాళ్ళందరూ నాగార్జునసాగర్ వెళ్తున్నారట. మీరూ వస్తారా అని అడుగుతోంది.'' అని కల్పించి చెప్పాడు తను సుభద్రకు.

''శివారెడ్డన్న కొలీగే మీకున్నట్లు ఎప్పుడూ చెప్పలేదే మీరు''

''ఏంటీ, క్రాస్ ఎగ్జామినేషన్. ఇంతకు ముందు చెప్పలేదేమో. ఇప్పుడు చెప్తున్నానుగా'' అన్నాడు తను విసుక్కుంటూ.

నవ్వింది సుభద్ర. మరేం మాట్లాడకుండా అక్కడనుండి లేచిపోయింది.

పోను పోను తనంత జాగ్రత్తలు తీసుకోవటం మానేశాడు. సుభద్రకూడా తన పరిస్థితికి రాజీపడిపోయింది అనుకున్నాడు తను. అదే పొరపాటయింది. రేవతి తన స్టెనో. రేవతితోపాటు మద్రాసు కాన్ఫరెన్సుకు వెళ్ళినప్పుడు అక్కడ ఆమెతో సంబంధం ఏర్పడింది తనకు. ఆరోజు తను ఆఫీసుకు వెళ్ళలేదు. అర్జంటు ఫైల్సుమీద సంతకాలకోసం ఇంటికొచ్చింది రేవతి. సుభద్ర తన గదిచూపి లోపలికి వెళ్ళింది. ఫైల్సుమీద సంతకాలు పెట్టి, రేవతి వద్దన్నా, ఆమె చెయ్యి పట్టుకుని దగ్గరకు లాగి కౌగిట్లోకి తీసుకుని ముద్దుపెట్టుకున్నాడు తను. కాఫీ తీసుకొస్తున్న సుభద్ర చూసింది. తప్పు చేసినట్టు పారిపోబోయింది రేవతి.

''అయ్యో! కాఫీ తీసుకుని వెళ్ళు'' అంది సుభద్ర రేవతి చెయ్యి పట్టుకుని ఆపుతూ.

''నేను... నేను.. నేనేం చేయలేదు.. ఆయనే...'' అంది రేవతి తొట్రుపడుతూ.

''ఎందుకంత భయపడ్తావు. ప్రాణం పోయేంత ప్రమాదమేం జరగలేదు'' అంది నవ్వుతూ సుభద్ర.

రేవతేం మాట్లాడలేదు, కాఫీ కప్పు పట్టుకు కూర్చుంది.

''ఊఁ, ఎంతకాలం నుండి సాగుతోంది వ్యవహారం''

''మా మధ్య సంబంధమేం లేదు ఆంటీ, ఇవాళే ఆయన.....''

''ఇదుగో అశ్వనీ....!''

''రేవతాంటీ''

'' చివరి తారన్నమాట! సరే. నన్ను ఆంటీ అనకు. అక్కా అను. మీ నాన్నేం చేస్తారు?''

''మా నాన్న లేరు. అమ్మా నాన్నా చిన్నప్పుడే పోయారు. మా మేనమామ దగ్గరే పెరిగాను.''

''ఎంతవరకు చదువుకున్నావు?''

''బి.యే. టైపు, షార్టుహాండు నేర్చుకున్నా''

''మీ మామయ్యకు బాగా ఆస్తివుందా?''

''పెద్ద ఆస్తి ఏం లేదు. ఆయనకు పుస్తకాల షాపుంది''

''నిన్ను బాగా చూస్తారా?''

''మా అత్తయ్యకు నేనుండడం ఇష్టం లేదుగానీ, ఆయన నన్ను బాగానే చూస్తాడు''

''ఎన్నేళ్ళబట్టి చేస్తున్నావు ఈయన ఆఫీసులో?''

ఈ క్రాస్ ఎగ్జామినేషన్ చూసి తనకు మంట పుట్టింది.

''ఆ వివరాలన్నీ నీ కనవసరం'' అన్నాడు తను కోపంగా.

సుభద్ర తనవంక చూసి గలగలా నవ్వింది.

''ఎందుకలా నవ్వుతావు. నీకేం పిచ్చి పట్టిందా?''

''గండు పిల్లి... గండు...'' అని పొట్టపట్టుకు నవ్వుతోంది.

''గండు పిల్లేమిటీ?''

''తలుపులన్నీ మూసి పిల్లిని కొట్ట ప్రయత్నిస్తే, గండు పిల్లి పెట్టే మొహంలావుంది, మీ మొహం'' అంది సుభద్ర నవ్వాపుకుంటూ.

''నోర్మూసుకో, పిచ్చివాగుడు వాక్క''

''చూడు రేవతీ, ఆయన ప్రలోభంలోపడి నిన్ను నువ్వు నాశనం చేసుకోకు తల్లీ! నాలుగు రాళ్ళిచ్చే ఉద్యోగం కోసం నిన్ను నువ్వు అవమానించుకోవటమెందుకూ! ఈయన నిన్ను అవసరమైనంతకాలం వాడుకుని గిరవాటేస్తాడు. మించిపోయిందేం లేదు. అయినదాని గురించి కాక, కావాల్సిందానిగురించి ఆలోచించు. ఇక వెళ్ళు'' అంది సుభద్ర.

రేవతి ఫైళ్ళు పట్టుకుని తలొంచుకుని వెళ్ళిపోయింది.

''అశ్వని, భరణి, కృత్తిక, రోహిణి, మృగశిర.. అహ చుక్కల్లో చంద్రుడిలా ఏం వెలిగిపోతున్నారండీ. మీ దారిద్ర్యాన్ని చూస్తే నాకు జాలి కలుగుతోంది'' అంది సుభద్ర.

''దారిద్ర్యమేంటి...!''

''ఇంకా ఇంకా పోగేసుకోవాలనే ఈ వెంపర్లాట దారిద్ర్యం కాక మరేమిటి?''

అంతే- ఆరోజు తర్వాత తనను దగ్గరకు రానివ్వలేదు ఆమె. తమ మధ్య భార్యా భర్త సంబంధాలు నశించాయి.

''ఎంగిలి పడ్డ ఆహారం నేను తినను, తిండిలేకపోయినా మాడ్తాను గానీ'' అందామె.

''అర్థం లేని మాటలు మాట్లాడకు. ఎంగిలి పడడమేమిటీ?''

''మీ మనసు ఎంగిలి పడ్డది. పక్క పొలాల్లో దొంగగడ్డి మేసింది కడుపు. మొగవాడి లాలసత్వం సంగతి నాకు తెల్సు. ఊహించాను కాని, నిజమని నమ్మలేదు. కళ్ళతో చూసిం తర్వాతిహ నేను మిమ్మల్ని భరించలేను. ఇప్పటికయినా పశ్చాత్తాపం చెందని మిమ్మల్నెలా క్షమించగల్ను?''

''నువ్వు నన్ను క్షమించేదేమిటి? మగాడన్న తర్వాత సవాలక్ష సంబంధాలుంటాయి.''

''పోతు... పోతు....'' అని ఫక్కున నవ్వుతూ.. ''మూర్ఖత్వం పోత పోసిన విగ్రహం మీరు'' అంది నవ్వాపుకుంటూ.

బెదిరించయినా ఆమెను లొంగదీసుకోవాలని ప్రయత్నించాడు తను.

''నువ్వంటే నాకిష్టం లేదు. నీకు విడాకులు ఇద్దామనుకుంటున్నాను'' అన్నాడో రోజు తను.

సుభద్ర నవ్వింది.

''ఎందుకలా నవ్వుతావు. సిగ్గులేని మొహానికి నవ్వే సింగారమన్నట్లు'' అన్నాడు తను కోపంగా.

''అహఁ, ఏంలేదు. అసలు మీకీ ప్రపంచంలో ఇష్టమయిన వాళ్ళు ఎవరైనా వున్నారా అని ''

ఖంగు తిన్నట్లయింది తన పని. ''ఏం, ఎందుకులేరు. మా ఎం.డి. కి నేనంటే ఎంతో ఇష్టం. రేవతి నేనంటే ప్రాణం పెడ్తుంది. పిల్లలకీ నేనంటే ఇష్టమే.'' అన్నాడు తను.

''నేనన్నది ఇతరులు మీరంటే ఇష్టం చూపటం కాదు. నేనడిగింది మీకెవరైనా ఇష్టులు ఉన్నారా అని''

''ఏదయినా ఒకటే. వాళ్ళకి నేనంటే ఇష్టం. నాకు వాళ్ళంటే ఇష్టం.''

''అహఁ అలాగా! నాకు మీరంటే ఇష్టమైతే, మీకు నేనంటే ఇష్టమన్నమాట. అంతే కదూ!''

''స్టాప్ దిస్ బ్లడీ నాన్సెన్స్., నీ అతివాగుడుతోనే ఇంతవరకు తెచ్చుకున్నావు. నీకింత స్వేచ్ఛనివ్వటం నాదే పొరపాటు''

''ఇంతవరకు వచ్చింది నా అతివాగుడు వల్ల కాదు. మీ మితిమీరిన ప్రవర్తనవల్ల. స్వేచ్ఛ అనేది ఎవరో ఇస్తే పుచ్చుకునేది కాదు.''

''మనిషన్న తర్వాత కొంచెమయినా కృతజ్ఞత వుండాలి. ఇన్ని ఆలోచనలు నీకెలా కలిగాయి.

చదివించబట్టే కదా. మీ నాయన నిన్ను ఎస్.ఎస్.ఎల్.సితో ఆపేస్తే, నేను ఎం.ఏ కూడా చేయించాను. ఆ తెలివితేటలన్నీ భస్మాసురహస్తం లాగా నా మీద ప్రయోగిస్తున్నావు. అసలు మీ వంశమే అంత. చేసిన మేలు మర్చిపోయే జాతి మీది.''

''ఇందులో ఏ ఒక్కటీ నిజం కాదు. ఒకటి - మీ సోకాల్డ్ హై సొసైటీలో విద్యావంతురాలైన భార్య వుండటం మీకో ఎస్సెట్. అందుకోసం, మీకోసం చదివించారు. రెండు. చదివిస్తే వివేకవంతులవుతారన్నది అనాలోచితమైన మాట. వెలిగే దీపం లేకపోతే ఎంత చమురు పోసినా ఏం లాభం. సమాజంలో డిగ్రీలున్న పశువులు ఎన్ని కన్పించటం లేదు మనకు. మూడు. కట్నం పోసి కొనుక్కున్న మీకు మా నాన్న, మా వంశం, నేను ఏం కృతజ్ఞత చూపాలి. నాలుగు - కట్నం డబ్బుతో ఆస్తి సంపాదించిన మీరు, ఆ ఆస్తి నన్నునుభవింపచేస్తారో లేదో - భస్మాసుర హస్తం నాదో మీదో ఎవరికెరుక? ఐదు - మీరు అన్నం పెట్టి పోషిస్తున్నందుకు ఇంటి చాకిరీ అంతా నేనే చేస్తున్నాను. బయటి పనులూ చూస్తున్నాను. దండగ తిండి నేనేం తినడం లేదు. అందువల్ల మీకు నేను ఋణపడి వుండాల్సిన అవసరం లేదు. ఆరు - ...''

''ఆపు...ఆపు...అన్నీ నా తప్పులే. ఏమయినా నీకూ నాకూ పడడం లేదు. మనం సామరస్యంగా విడిపోతే మంచిది??

''ఇది సరైన మాట. అలాగే విడిపోదాం''

''రేపు లాయరు దగ్గరకెళ్దాం. నువ్వు కోర్టులో విడాకులకు పిటీషను పెట్టు''

''నేనెక్కడికీ రాను. విడాకులిచ్చేది మీరు. నేను కాదు. ఆ పిటీషనేదో మీరే పెట్టుకోండి''

''సరే నేనే పెడ్తాను. నిన్ను వదిలించుకుని, రేవతిని పెళ్ళి చేసుకుని హాయిగా వుంటాను''

''సరే, అలాగే చేసుకోండి. కాని సుఖంగా వుంటానని మాత్రం అనకండి. సుఖం, దుఃఖం మానసిక లక్షణాలు. భౌతిక పరిస్థితులకీ వాటికీ సంబంధం లేదు''

అంతగా వితర్కించే స్త్రీతో నిజంగానే విడివడాలని కోపంలో అనుకున్నాడు గాని, ఇంకా మానవాంశ ఏదో తనలో మిగిలివుండటం వల్ల తనా ప్రయత్నం చేయలేదు. తామారోజు రాత్రి పార్టీ నుండి కారులో ఇంటికొస్తున్నారు. ఏక్సిడెంటయి తనకూ, సుభద్రకూ కూడా దెబ్బలు తగిలాయి. సుభద్ర కక్కడక్కడా గీరుకుపోయింది కాని, తనకి మాత్రం బాగానే గాయాలయాయి. డాక్టరు 'ఎందుకయినా మంచిది, తల స్కాన్ చేసి చూద్దామ'న్నాడు. అబ్జర్వేషన్‌లో ఉంచారు.

స్పృహ వచ్చినప్పటినుండి ఆమెకోసం తానెంత వెంపర్లాడిపోయాడు. తనామెను తన పక్కనుండి కదలనివ్వలేదు. ''సుభద్రా, నువ్వెక్కడికీ వెళ్ళకు, నువ్వు లేకపోతే నేనేమయిపోతానో నాకే తెలీదు...'' అనేవాడు.

''ఎక్కడకు వెళ్తాను మిమ్మల్నొదిలి! మీ పక్కనే కూర్చున్నాగా, నిద్ర పట్టించుకోండి. తగ్గిపోతుంది...''

''క్షమించు సుభద్రా! నిన్ను నిర్లక్ష్యం చేశాను.... ఇప్పుడు నా ప్రవర్తన తల్చుకుంటే నాకే సిగ్గేస్తోంది... బతికి బట్టకడ్తే మాత్రం ఇంకెప్పటికీ అలా జరగదు''

''ఇప్పుడా మాటలన్నీ ఎందుకు! పడుకోండి.... నిద్ర పట్టించుకోండి'' అంది ఆమె తన చెయ్యి నొక్కుతూ, కుడి చేత్తో నుదుటిమీద రాస్తూ.

కోలుకుంటున్న ఆ మూడు నాలుగు రోజులూ సుభద్రకంటే ఆత్మీయురాలెవరూ కన్పించలేదు తనకి. సుభద్రకూడా తన కష్టాన్ని ఏ మాత్రం బయటపెట్టకుండా నవ్వుతూ ప్రేమగా తనకి సేవ చేసింది.

బ్రెయిన్‌కేమీ దెబ్బ తగల్లేదని డాక్టర్లు చెప్పారు. తన గాయాలు మాను పడ్తున్నాయి. ప్రమాదం తప్పిపోగానే తన కక్కడవున్న సుభద్ర అద్దంకిలా కనపడసాగింది. నర్సులు నక్షత్రాల్లా కన్పించారు. సుభద్ర ఇంటికెళ్ళి వచ్చేలోపల చుక్కల్లో చంద్రుడిలా భాసించి పోయాడు తను. ఉత్తరతో పరిచయమైంది, కొత్త కాలక్షేపానికి.

ఆ తరువాత ఎక్కువరోజులు బతకలేదు సుభద్ర. కూతురు రాజి పెళ్ళయిన రెండేళ్ళకు పోయింది. గుండె జబ్బన్నారు. తగ్గిపోతుందన్నారు. కాని ఒకరోజు అకస్మాత్తుగా ఆగిపోయింది గుండె. పోయే రోజంది ఆమె, ''మీకు నేనంటే ప్రేముందన్నమాట. మనకు భార్యాభర్తల సంబంధం లేకపోయినా విడాకులివ్వలేదు మీరు. పోన్లెండి. నేనెళ్ళిపోతున్నాను. చుక్కల్లో చంద్రుడిలా వెలిగిపోండి మీరు'' అని.

★ ★ ★

సుభద్ర వెళ్ళిపోవడంతో, అతని మనోఆకాశంలోనుండి తారలన్నీ రాలిపోయాయి. వయసులేక కాదు. శరీర సుఖానికి మించినది ప్రేమ అన్న జ్ఞానం అప్పుడప్పుడే కలగసాగింది. అందుకనే ధవళదూసరుడైపోయాడా చంద్రుడు.

'ఈనాడు' ఆదివారం

18-9-1994